# సుశీల కథలు

**జీవియస్**

(జి.వి సుబ్రహ్మణ్యం)

1997

**జీవియస్ సాహితీ కళాపీఠం**

హైదరాబాదు – 500 044

**SUSEELA KATHALU**
by G.V. Subrahmanyam 'GVS'
professor of Telugu (Retd.) University of Hyderabad.
Serialised in 'Andhra Bhoomi' weekly between 17-10-1996 and 27-3-1997

© Author

First Edition : June 1997

Copies : 1000

Price : Rs. 40/-

Cover design : **SRI KARUNAKAR**

Copies Available with :
**VISALANDHRA PUBLISHING HOUSE**
4-1-435, Vigyan Bhavan, Bank Street,
Hyderabad - 500 001 and Other Branches.

**NAVODAYA BOOK SELLERS**
In front of Arya Samaj, Kothi, Hyderabad.

Published by :
**GVS SAHITEE KALA PEETHAM**
Sri vani, 1-8-702/105,
Nallakunta, Hyderabad - 500 044.

DTP and Printed at :
**SRI DATTA SAI GRAPHICS**
sri vani, 1-8-702/105,
Nallakunta, Hyderabad - 500 044
Ph : 7633275

నా
తోడు
నీడ
**సుశీలకు**

# అద్వైత సిద్ధి

**– శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి**

ప్రముఖులు తమ స్వీయ చరిత్ర రాయడానికి రకరకాల పద్ధతులను అనుసరిస్తారు. 'డైరీ'ల రూపంలో కొందరూ, ఉత్తరాలూ వ్యాఖ్యల రూపంలో కొందరూ, జ్ఞాపకాల రూపంలో కొందరూ, చారిత్రాత్మకంగా కొందరూ రాస్తూండటం మామూలు, కథల రూపంలో రాయడం 'జీవియస్' గారు ఎంచుకున్న వినూత్న పద్ధతి. జి.వి. సుబ్రహ్మణ్యంగారి జీవితంలోని ముఖ్య సంఘటనలే సుశీల కథలకు ఆధారం.

'సుశీల కథలు' రూపొందించడంలో మరొక నవ్యాంశం ఉంది – భార్య సుశీల స్వీయకథ చెబుతున్నట్లుగా భర్త జీవియస్ రాయడం! కథలు సుశీలవి, కథకులూ, కథానాయకులూ జీవియస్! కలం జీవియస్‌ది, అందులోంచి వెలువడే మాటలు సుశీలవి. ఆ మాటలు పలికించినది జీవియస్! మాటల్లో సుశీల 'శబ్దం' అయితే, జీవియస్ 'అర్థం'. పద్యంలో సుశీల 'గుణం' అయితే, 'గతి' జీవియస్. ఆవిడ 'కవిత', ఆయన 'విమర్శ'. వారిద్దరి మధ్యా 'గ్రామరుంది'ట గాని 'విభక్తుల్లేవు'ట! ఇదొక ప్రయోగాత్మక రచన. అద్వైతానికి ప్రతీక.

ఈ కథలు ఇల్లాలు ముచ్చట్లు వంటివి కావు. ఈ కథా సంపుటి ఒక విధంగా ఒక తెలుగు ఇల్లాలి కథ– ఒక పల్లెటూరి లోని సాంప్రదాయక, మధ్య తరగతి కుటుంబంలోకి 'హార్మోనియమ్'తో సహా కాపురానికి వచ్చిన కొత్త కోడలు (మేనకోడలు) స్థాయినుంచి, ఉత్తర హిందూ స్థానంలో పెరిగిన ఆధునిక తెలుగు యువతిని కోడలుగా పొంది, 'సమన్వయవాది' అనిపించుకున్న అత్తగారి స్థాయికి ఎదగడం వరకూ మనోహరంగా, రసజ్ఞంగా, కవితాత్మకంగా చిత్రించిన కథ. తెలుగుతనాన్ని ప్రతిబింబింప చేసేట్లుగా, సాహితీ పరిమళాలను గుబాళింపచేసేట్లుగా, తాత్విక కాంతుల్ని వెదజల్లేట్లుగా జీవియస్ రూపొందించిన కథలతో కూడిన ఆత్మ చరిత్రాత్మక నవల ఇది.

"పావురాల్లా ఎగిరే జ్ఞాపకాలను" పట్టుకొని పొందిగ్గా కథల్లాంటి గూళ్లలో అమర్చి, మనముందు ప్రదర్శిస్తారు జీవియస్. ఇది కేవలం ఒక సాహితీ మూర్తి

కుటుంబ కథ మాత్రమే కాదు. ఇది జీవియస్ మాటల్లో "ఎ టేల్ ఆఫ్ త్రీ ట్విన్ సిటీస్" – ఆదిపూడి, వరంగల్, హైదరాబాదు – ఈ మూడూళ్ళ నేపథ్యంలో వికసించిన సామాజిక, సాంస్కృతిక జీవితం ఉంది ఇందులో.

"ఇల్లాలు ఇంటికి కేంద్రం. ఆమె భూమ్యాకర్షణ శక్తి లాంటిది. ఆ ఆకర్షణ శక్తి సంసార పరిధి దాటి ఆవలకు చేరుకుంటే ఇల్లు కూలిపోతుంది" అనే సాంప్రదాయక విశ్వాసానికి అనుగుణంగా దాంపత్య జీవనం సాగిస్తూ, నిత్య నిరీక్షణలో నీరస పడకుండా, తన అసంతృప్తులను అవగాహనతో క్షాళనం చేసి, భర్త ప్రగతే, తన జీవిత పరమార్థం అనుకుంటూ అద్వైత సుఖాన్ని సాధించిన ఇల్లాలు సుశీల. "దీపం కింది నీడ" లా మసలుకో గలదు. అయితే, "నేను సంపాదించకపోయినా మిమ్మల్ని శాసించే హక్కుంది నాకు" అనే ధీమా ప్రదర్శించగల 'నీడ' ఆమె. "నేను సమన్వయవాదిని కాబట్టే మీతో కాపురం చేయగలుగుతున్నాను" అని చెప్పగల ఆత్మ విశ్వాసం ఉన్న గృహిణి.

సుశీల అసూయకి అతీతురాలు కాదు. ఉద్యోగధర్మంగా ఒక స్త్రీని ఆమె బలవంతం మీద అనుభవించవలసి వచ్చిందని బాధపడుతూ చెప్పిన భర్తతో "మీరు మైలపడ్డారు" అంటుంది సుశీల. 'మనసు మైల పడలేదు' అని సమాధానం వస్తుంది – అత్యాచారానికి గురైన స్త్రీది నేరం కాదన్నట్లే. భర్త మరో స్త్రీతో సన్నిహితంగా మెలిగాడని తెలిసి మళ్లీ బాధపడుతుంది సుశీల. తను పిల్ల తల్లి అయాక భర్త తనను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న భావం పీడిస్తుంది. ఆ సమస్యని పరిష్కరించడానికి చమత్కారంగా భార్యకి కృష్ణతత్త్వాన్ని (గోపికృష్ణ – రాధాకృష్ణ) విశ్లేషించి చెప్పడంలో జీవియస్ సున్నిత మనస్తత్వం, సుశీల అవగాహనాశక్తీ ప్రదర్శితమవుతాయి.

'అమలిన శృంగారం', 'ప్లెటానిక్ లవ్' అనే వెనకటి పదజాలం వాడకుండా, 'ఇంటలెక్ట్యువల్ కంపానియన్ షిప్' అనీ, 'ప్రతిభా పూర్ణమైన స్నేహం' అనీ వాడారు జీవియస్. సుభాషిణి అనే శిష్యురాలిని "కలభాషిణీ రూపమైన సుభాషిణి" గా అభివర్ణించి అభినందిస్తారు. గురువుగారిని ఆరాధించడానికీ, ఆయనతో సన్నిహితంగా మెలగడానికీ గురపత్ని అయిన సుశీల అమాయకురాలు కాదు. "మా వారితో ఇంటలెక్ట్యువల్ కంపానియన్ షిప్‌కు లైసెన్సు అడుగుతున్నారా నన్ను?" అని ప్రశ్నించి, "ప్రబంధపాత్రలకు మనం ప్రతిబింబాలం కాలేము. కానీ, ప్రబంధానికీ ప్రపంచానికీ

మనం పూలవంతెన కట్టవచ్చు" అనే సూచన చేసి, ఒక నమస్కారం పెట్టి పంపించగల గడసరి సుశీల. తరువాత, ఆ గురుశిష్యులది అన్నా చెల్లెళ్ల సంబంధం వంటిది మాత్రమే అని గ్రహించి, ఆమెని ఆదరంగా చూడగల పరిణతి ప్రదర్శిస్తుంది సుశీల.

భర్త సహవాసంలో సుశీల కూడా సాహితీ పరిమళాలను వెదజల్లగల శక్తిని సంపాదించుకున్నదనీ, అనుకున్నంత అమాయకురాలు కాదనీ, పులిలాంటి రౌడీ విద్యార్థిని కూడా "పిల్లాడిని చేసి పల్టీ" కొట్టించగల సమర్థురాలనీ "సామాన్యురాలు కాదు" అనీ, "గురువు గారికే గురువు గారు" కా గల మేధాశక్తి సంపన్నురాలనీ తెలుసుకుంటాం.

అయితే, శ్రీకృష్ణుడు సత్యభామకి ఓడినట్లు కనిపించినట్లుగానే, జీవియస్ భార్యముందు తగ్గినట్లు కనిపిస్తారు. అప్పుడప్పుడు – ఓడినా తనకే గౌరవం అని తెలిసి! ఈ కథల్లో జీవియస్ అనురాగ పూరితమైన జీవన సహచరుడిగానే కాకుండా, గడసరి భర్తగా కూడా కనిపిస్తారు. సరస సంభాషణల్లో 'సమ' ఉజ్జీగా, సాహితీ చర్చల్లో తెలివైన శిష్యురాలిగా, మేధావి, సాహితీమూర్తి అయిన భర్తని ఓడించగల చతుర భాషిణిగా కథకురాలైన సుశీలని చిత్రిస్తూనే, తన గురించి తాను వినదలచుకున్న ప్రశంసా వాక్యాలను భార్య నోటితో చెప్పించి వారి అన్యోన్యతని చాటారు. సుశీల తన భర్త లోపాలను అప్పుడప్పుడు ఎత్తి చూపినట్లు రాయడంలో జీవియస్ నిజాయితీ ప్రదర్శితమవుతుంది.

సుశీల భర్త అడుగు జాడల్లో నడిచే 'ఆదర్శ గృహిణే' కాదు, ఆత్మ విశ్వాసం నిండిన వ్యవహర్త కూడా అని 'శేషయ్య శేషప్రశ్న'లో శేషయ్య గారి మరణం సృష్టించిన సమస్యని పరిష్కరించడంలో వెల్లడవుతుంది. మొత్తంమీద సుశీల బహుముఖ వ్యక్తిత్వం పాఠకులను ఆకట్టుకుంటుంది.

వివిధ వ్యక్తుల చిత్రణ చేస్తూ, చమత్కార భరితమైన సంభాషణలను గుప్పిస్తూ, తన స్వీయ చరిత్రని ఆసక్తికరంగా, పఠనీయంగా రూపొందించ గలిగారు జీవియస్. 'యువభారతి' సంస్థ ఆవిర్భావం గురించీ, దాని పట్ల తమ నిబద్ధత గురించీ, గంభీరమైన సాహిత్య విషయాల గురించీ ఎన్నో వివరాలను కుటుంబ సభ్యుల మధ్యా, భార్యభర్తల మధ్యా సంభాషణల్లో అలవోకగా ప్రవేశ పెట్టడంలో జీవియస్ గారి కథారచనా కౌశలం ద్యోతకమవుతుంది.

గంభీరంగా సాహిత్య విషయాలను విశ్లేషించినట్లే 'మడి – ఆచారం' లోని రక రకాల స్థాయిల్ని వివరంగా, లోతుగా విశ్లేషిస్తుంటే, "ఇది సాహిత్య విమర్శకాదు' అంటుంది సుశీల. "సాహిత్య విమర్శ జీవిత విమర్శ నుంచి పుట్టేదే" అంటూ ఒక మౌలికాంశాన్ని సునాయాసంగా సూచిస్తారు జీవియస్. ('మడి' అనే సంస్కృతి అన్ని చోట్లా లేకపోవడం వల్ల, ఆ పదాన్ని ఇతర భాషల్లోకి – ముఖ్యంగా హిందిలోకి, ఇంగ్లీషులోకి అనువదించాలంటే చాల కష్టం!)

జీవియస్ దంపతులు శ్రీ భగవాన్ సత్యసాయిబాబా భక్తులు. బాబాకి సన్నిహితులు. 'సత్యసాయి సన్నిధి'లో సాహిత్య వివేచన జరగడం, అఖిల భారత స్థాయిలో వివిధ భారతీయ భాషల్లో వెలువడిన రామాయణాలన్నింటినీ చర్చించడానికి సదస్సు ఏర్పాటు చేయడం బాబా సాహిత్య పిపాసని ప్రస్ఫుటం చేస్తుంది. జీవియస్ దంపతులు పెళ్ళి నిశ్చయమైన తమ కొడుకునీ కోడల్నీ ఆశీర్వచనం కోసం తీసుకు వెళ్ళినప్పుడు, బాబా ఆధునికతనీ, సంప్రదాయాన్నీ పాటిస్తూ "వైఫ్ ఈజ్ లైఫ్" అని వరుడికీ, 'మదర్.....లోనూ, మదర్–ఇన్–లా లోనూ సమంగా ఉన్న 'మదర్' ని గౌరవించమని వధువుకిఈ హితవు చెప్పడం వంటి ఆసక్తికరమైన విశేషాలెన్నో ఉన్నాయి సుశీల కథల్లో.

వైవాహిక జీవితమంతా సమన్వయ దృష్టితో, పరస్పర సహకారంతో "మూడు ముడుల ముచ్చట"లా గడుపుతూ, తమ జీవితాలను అద్వైతంగా సాగిస్తున్న 'కథకురాలు' సుశీల గారూ, కథారచయిత జీవియస్ గారూ అభినందనీయులు.

**అబ్బూరి ఛాయాదేవి**

20.6.97

# సమాజ పరిణామాన్ని సూచించే సుశీల కథలు

డాక్టర్ వేదగిరి రాంబాబు

కాలం మారుతోంది. మారుతున్న కాలంతో పాటు విలువలూ మారుతున్నాయి. ఈ మారుతున్న విలువల వల్ల తరాల మధ్య అంతరం ఏర్పడుతోంది.

నాటి విలువల్ని, జీవితాల్ని, సమస్యల్ని, సమాజాన్ని పరిశీలిస్తే కొన్ని విలువల విలువ మనకి తెలుస్తుంది. మన సంస్కృతికే వన్నె తెచ్చే ఆ విలువల వలువలు వూడతీయకూడదనే నగ్నసత్యం ద్యోతక మవుతుంది.

కొన్ని సమాజాన్ని బట్టి మారాల్సిన విలువలైతే, కొన్ని శాశ్వత విలువలు, ఈ శాశ్వత విలువలు శాశ్వతంగా మారకుండా వుంటేనే మానవత్వం మంటగలవకుండా వుంటుంది. ఈ విలువల్ని తెలియజెప్పే సాహిత్యం సమాజాని కెంతో అవసరం.

ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన ప్రముఖ సాహితీ విమర్శకులు జీవియస్‌గారు. అందుకే మంచి విలువల్ని మన కందించడానికి సుశీల కథలను అందించారు. మనముందుతరం ఆలోచనలు, ఆశయాలు, అంతర్మథనాలు సుశీల కథలద్వారా చక్కగా చెప్పారు.

సుశీల కథలు కావు అవి – మనముందు తరపు మధ్య తరగతి స్త్రీ జీవితపు మలుపులు. ఆ మలుపులలో ఎన్నో మెరుపులు మెరిపించి కథలు కథలుగా వారం వారం ఆంధ్రభూమి వారపత్రిక ద్వారా పాఠకుల కందించారు. ఇప్పుడా ఇరవైనాలుగు కథలు ఒక సంపుటిగా రావడం ఆనందకరం.

కన్నెగా, శ్రీమతిగా సుశీల జీవితంలోని ముఖ్యమైన ఘట్టాల్ని చిన్న చిన్న సంఘటనలతో చాలా ఆసక్తికరంగా చెప్పారు జీవియస్. కొన్ని కొన్ని ఘట్టాలు కాస్త పెద్దవి కావడంతో రెండు, మూడు వారాలు నడిచాయి. కొన్ని ఒక వారంలోనే ముగిసాయి. అందుకే ఇవి వారం వారం చదివేకన్నా కూడా ఒకేసారి చదవడం పాఠకులకి తృప్తినిస్తాయి.

పండితుల భాషతో సామాన్యుడికి కాస్త ఇబ్బంది ఎదురవుతుంటుంది సామాన్యంగా. అందుకు భిన్నంగా జీవియస్ గారు ఈ కథలని ఎవరికోసం రాసారో వాళ్ళందరికీ అర్థమయ్యేటట్లు సులభ శైలిలో సుశీల కథల్ని రాసారు. అందుకే ఇవి సీరీస్‌గా పత్రికలో వస్తున్నప్పుడూ అందర్నీ ఆకర్షించ గలిగాయి.

ఈ కథలు చదువుతున్నప్పుడు ఇవి కథలు కావు జీవితంలో వాస్తవ సంఘటల్ని ఆధారంగా తీసుకుని రూపొందించిన రచన లనిపిస్తాయి. కల్పన అధికశాతం కావచ్చు. అయినా సుశీల భర్త పాత్రలో జీవియస్‌గారు చాలా చోట్ల తొంగిచూస్తారు. ఆయన తాదాత్మ్యం చెంది రాసిన కథలు కాబట్టే వీటిలో కొత్తజీవం తొణికిసలాడింది.

ఆతరం స్త్రీ సుశీల జీవితంలో ఎన్నో విలువల్ని మన ముందుంచిన జీవియస్‌గారు చివర్లో "నేను ప్రవాహాన్నో, ప్రవాహంలో ఈదుతున్నదాన్నో నాకే తెలియదు. మార్పు నా చుట్టూ ముంచుకొస్తోంది. ఒడిదుడుకు లెన్నో నన్ను ఒత్తిడులు చేస్తున్నాయి. నాకు పురస్కారాలతో పాటు తిరస్కారాలూ ఎదురౌతున్నాయి. అయినా వాటి నన్నింటినీ తట్టుకుని ఇల్లాలుగా నా పాత్ర నిర్వహిస్తున్నాను. నేను కొత్త నాహ్వానించాలంటే నాకు కొత్త అవగాహన కావాలి. దానికి మీ సాయం కావాలి" అనిపిస్తారు సుశీలపాత్రలో.

"నేను పరిణామాన్ని కాదనే పలాయనవాదిని కాను...కాని, నా పాత్రను నేను అవగాహన చేసుకుని అభినయించాలని కోరుకుంటున్న దాన్ని ....."భర్తతో నిండుకుండలాంటి సుశీల అంటే, "మా బామ్మ ఆదర్శవాది. మా అమ్మ సంస్కరణవాది. నువ్వు సమన్వయవాదివి. నీ కోడలు వాస్తవవాది....ఇది ఒక పరిణామం....ఇది వ్యక్తికీ, వ్యవస్థకూ మూలం" అని సుశీలభర్తతో చెప్పిస్తారు జీవియస్.

నాటి విలువల్ని, మారుతున్న విలువల్ని వాస్తవ ధోరణిలో వివరించిన సుశీల కథలు మనందరం చదవాల్సినవి. ఆ కథలు మన కెన్నో విషయాలు చెప్తాయి. మన ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తాయి.

చదివిన తర్వాత కాసేపైనా ఆలోచింపజేయడం మంచి కథలు లక్షణం. సుశీల కథల్ని చదువుతుంటే మన తల్లిదండ్రులు నాటి పరిస్థితులు కళ్ళముందు మెదుల్తాయి. నేటి పరిస్థితులతో వాటిని పోల్చుకుంటాం. మారుతున్న విలువల్లో మారాల్సినవేవో,

మారకూడనివేవో తెలుసుకోవడానికి ఆలోచిస్తాము. అది చాలు ఈ కథల ప్రభావం మన మనసుల మీద ఎంతో పడిందో తెలుసుకోవడానికి!

ఈ కథలు చదివిన తర్వాత సుశీల పాత్ర మీద మన కెంతో గౌరవం కలుగుతుంది. సుశీల జీవియస్ గారి శ్రీమతి పేరు కావడం విశేషం. ఈ పుస్తకం జీవియస్‌గారి శ్రీమతిగారి అరవయ్యవ జన్మదినంనాడు ఆవిష్కరణ జరగడం మరో విశేషం. ఈ సందర్భంలో అరవైమంది కథారచయితల్ని, రచయిత్రుల్ని సత్కరించబూనడం ముదావహం. ఈ పుణ్యదంపతులిద్దరికీ భగవంతుడు ఆయురారోగ్యాల్ని ప్రసాదించాలని, జీవియస్ గారి కలం నుండి మరికొన్ని మంచి కథలు రావాలని కోరుకుంటూ శలవు తీసుకుంటున్నాను.

**వేదగిరి రాంబాబు**

23.6.97

# జన వాక్యాలు

**జీవియస్ రాస్తున్న 'సుశీల కథలు' కథలు రాసే వారికి మార్గదర్శకాలు. శృంగారం అంటే ఏమిటో ఎలా వుండాలో పరమ రమణీయంగా చెపుతున్నారు.**

(ఆంధ్రభూమి, 28-11-1996) – కె. మాధవరావు (హైదరాబాదు)

**ప్రతివారం వస్తున్న 'సుశీల కథలు' చాలా బాగుంటున్నాయి. హాస్యం, వాస్తవికతలతోపూ, అశ్లీలానికి తావు లేకుండా జీవియస్ వ్రాస్తున్న శైలి మాకు చాలా బాగా నచ్చింది.**

(ఆంధ్రభూమి, 5-12-1996) – ఆర్.బి. సత్యనారాయణ (రాజమండ్రి)

**ఆంధ్రభూమిలో సీరియల్స్ అన్నీ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్లుగా ఉంటున్నాయి. సుశీల కథలు ఎంతో బాగుంటున్నాయి.**

(ఆంధ్రభూమి, 26-12-1996) –ఊర్మిళా సుభాన్ (మహబూబ్ నగర్)

**సుశీలకథల్లో 'మల్లెమనసు' కథ చాలా బాగుంది. ఓ పరస్త్రీ ఓ ఇల్లాలి భర్తను గురించి అడిగితే ప్రతి స్త్రీ మనసులో అనుమాన బీజం మొలకెత్తుతుంది. రచయిత కథ కిచ్చిన ముగింపు అభినందనీయం.**

(ఆంధ్రభూమి, 2-1-1997) – జి. విజయ సుజాత (కలిదిండి)

**ప్రతివారం వస్తున్న సుశీల కథలు చాలా బాగుంటున్నాయి. మళ్లీ మళ్లీ చదివేలా వుంటున్నాయి. రచయిత శైలి మాకు బాగా నచ్చింది.**

(ఆంధ్రభూమి, 16-1-1997) – రాంబాబు (గుంటూరు)

**జీవియస్ గారి 'సుశీల కథలు' ఎంతో బావుంటున్నాయి. వాస్తవానికి చేరువగా అందిస్తున్న రచయితకి అభినందనలు.**

**(ఆంధ్రభూమి, 23-1-1997)** – పట్ల యాదయ్య (గుండాల)

**సాంప్రదాయ తెలుగు సాహిత్య సుమ సౌరభాన్ని వెదజిల్లుతున్న 'సుశీల కథలు' ఆణిముత్యాలు.**

(ఆంధ్రభూమి, 30-1-1997) –బి. వీరమణి (గుండాల)

**దాంపత్య అనురాగాన్ని లాంటి చిలిపితనాన్ని మృదవైన సంభాషణలతో చిత్రిస్తూ మనసుల్లో మమతలు పొంగిస్తూ సుశీల కథలు చక్కని శైలిలో రమ్యంగా సాగిపోతున్నాయి.**

(ఆంధ్రభూమి, 30-1-1997) –ప్రియ (రాజాం)

**జీవియస్ గారి 'సుశీల కథలు' మా హృదయాలను దోచుకుంటున్నాయి.**

(ఆంధ్రభూమి, 30-1-1997) – సి. శైలజ (రాయచోటి)

**'సుశీల కథలు' మనసుకి గిలిగింతలు పెడుతున్నాయి.**

**జీవియస్‌గారి 'సుశీల కథలు' చాలా బాగున్నాయి. ఇలాంటి మంచి కథలను మాకు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు.**

(ఆంధ్రభూమి, 6-2-1997) – ఎస్.కె. నసీరుద్దీన్ (బెల్లంపల్లి)

**జీవియస్‌గారి 'సుశీల కథలు' సుకుమారమైన ఉపన్యాసాలతో మమ్మల్ని అలరిస్తున్నాయి.**

(ఆంధ్రభూమి, 13-2-1997) – ఆశా (గొల్లపల్లి)

**జీవియస్ గారి 'సుశీల కథలు' ప్రతివారం అణిముత్యంలా భాసిల్లుతున్నాయి.**

(ఆంధ్రభూమి, 27-2-1997) -

ప్ర.వెం. సుబ్బారాయుడు (జె.జె. నగర్)

**ఆంధ్ర సాహిత్యంలోని అమూల్యాంశాలను చిత్ర విచిత్రంగా పెనవేస్తూ ఆసక్తి కరంగా తీర్చిదిద్దుతున్న తెలుగు పండితుని అనుభవగాథా పరంపర జీవియస్ సుశీల కథలు. 'పులులూ అమాయకురాలూ' కథలో పులిలాంటి సుభాషిణి నిజానికి అమాయకురాలు. నేను అమాయకురాలిని అని చెప్పుకునే సుశీల నిజానికి పులి. వైవిధ్య భరితమైన, పఠనీయమైన కథలు జీవియస్ సుశీల కథలు.**

(ఆంధ్రభూమి, 13-3-1997) - డా॥

వెలుదండ నిత్యానందరావు (హైదరాబాదు)

# సొంతకథ

నాతో ముడిబడ్డ మా మేనమామ కూతురు సుశీలకథ తానే చెప్పుకుంటే ఎలా ఉంటుంది? చెప్పుకుంటున్నట్లు నేనే రాస్తే ఎలా ఉంటుంది?... మెరుపుల్లాంటి ఈ ఊహలకు వచ్చిన రెక్కలే ఈ కథలు.

ఇది స్వీయ జీవిత చరిత్రలా అనిపించవచ్చు. కాని, కాదు...జీవిత జీవనదీ తీరంలో నడిచినప్పుడు చెరిగిపోగా మిగిలిన కొన్ని పాదముద్రల పల్లవులు. వాస్తవం ఈ కథలకు ప్రాతిపదిక కావచ్చు. కాని, కల్పన దానిచుట్టూ సాలెగూడులా దట్టంగానే అల్లుకుని ఉంది. అందువల్లనే గాథలుగా జాలువారకుండా, కథలుగా రెపరెపలాడుతున్నాయి. కథలు రాసేటప్పుడు – “మంచి కథ కావాలంటే, నిజంగా జరిగిందయినా, చదివే వాళ్ళని నమ్మించలేకపోతే Fail అవుతుంది. జరగడానికి వీల్లేనిదైనా జరిగివుండా లనిపించేటట్లు రాస్తే రాణిస్తుంది” – అన్న చలం మాటలు చెవుల్లో రింగుమంటుండేవి. ఏమైనా, నా గుండె మ్రోగించుకున్న లిరికల్ కథాగీతాలు సుశీల కథలు.

మనిషి బ్రతుకులో మథింపబడి ఒక అనుభవంగానో, ఆదర్శంగానో, ప్రతీకగానో మారిపోవడం భావుకులు గమనించే జీవిత సత్యం. అలాగే నా కంటికి సుశీల ఒక వ్యవస్థకు సజీవ ప్రతినిధిగా నా అనుభవంలో మిగిలింది. ఆ వ్యవస్థకు తెలుగు పేరు ‘ఇల్లాలు’ స్వతంత్ర ప్రతిపత్తి కోసం సతమత పడి, ఇల్లు దాటని ఇల్లాలిగా ఒక అస్తిత్వాన్ని కల్పించుకొని, ఒక తరానికి ప్రతినిధిగా నిలిచిన వ్యక్తి సుశీల ఆమె గతానికీ వర్తమానానికీ, భవిష్యత్తుకూ ఒక సమన్వయ సూత్రం. ఆ సూత్ర విచ్ఛిత్తిని ఆమె కోరదు. అదే సుశీల కథలలోని సున్నితమైన స్త్రీ చైతన్యం. ఆచారాలు, అవస్థలు, సన్నివేశాలు, సంఘర్షణలు మారవచ్చు. మార్పును కోరవచ్చు.....ఆ ఇల్లాలు అన్నింటికీ అనువుగా పరిణామం చెందుతుంది; పరిణతిని సాధిస్తుంది. కాని, విడాకులకు మాత్రం ఎప్పుడూ అంగీకరించదు. తరం మారిన జాడతో ఈకథలు ముగుస్తున్నాయి. యువతరంలో కూడా ఈ అవిచ్ఛిన్నత ఎలా అంతస్సూత్రంగా సాగుతుందో చెప్పాలంటే సుశీల కథలు రెండోభాగం రావాలేమో!

'సుశీల కథల' ను ధారావాహికంగా ప్రచురించిన ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక సంపాదక వర్గానికి హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనాలు. దీనిని గ్రంథ రూపంగా జీవియస్ సాహితీ కళాపీఠం తెస్తున్నందుకు సంతోషం.

ఈ గ్రంథం ఈ రూపంగా వెలువడడానికి ఎంతో ఆత్మీయంగా ప్రోత్సాహాన్ని ఇచ్చిన మాన్యమిత్రులు, కవివరులు డా॥ జె. బాపురెడ్డి గారికి, మాన్యులుచ సాహితీ మర్మాజ్ఞులు శ్రీ రాయసం వెంకట్రామయ్యగారికి, సహృదయ మిత్రులు, స్వాతి సంపాదకులు శ్రీ వేమూరి బలరామ్ గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

'సుశీల కథల' కు ముందుమాటలు వ్రాసి ప్రోత్సహించిన ప్రసిద్ధ కథా రచయిత్రి. విదుషీమణి శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి గారికి సమకాలీన కథా చైతన్య రథ సారథి, సహృదయ మిత్రులు డా॥ వేదగిరి రాంబాబు గారికి ధన్యవాదాలు. సుశీలకథలు సీరియల్‌గా వస్తున్నప్పుడుతమ ప్రశంసల నందజేసిన అశేషాంధ్ర ప్రజానీకానికి నమోవాకాలు.

'సుశీలకథలు' చి॥సౌ॥ సుశీలకు అంకితం కావటం ఉచితం. అంగీకరించిన సుశీలకు శుభాశీస్సులు. ఆంధ్రభూమిలో కథలు వెలువడుతున్నప్పుడు ప్రతి కథకూ శ్రీ కరుణాకర్‌గారు బొమ్మలు వేశారు. వాటిలో 'ఉగాది పచ్చడి' కథకు వేసిన బొమ్మను ముఖచిత్రంగా తీసుకున్నాను. అందంగా చిత్రాలంకరణం చేసిన శ్రీ కరుణాకర్‌గారికి కృతజ్ఞతలు.

చక్కగా అక్షరాలకూర్పు చేసిన శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ వారికి, ముద్రించిన విప్లా ప్రింటర్స్ వారికి అభివందనాలు.

అభిమానంతో కథలను చదివి ఆశీర్వదించండని అందరినీ కోరుతూ...

25-6-97 **జీవియస్**

హైదరాబాదు

## కథాక్రమం బెట్టిదనిన....


| | | | |
|---|---|---|---|
| 1. | అత్తింటి కోడలు | ..... | 1 |
| 2. | హార్మోనియం | ..... | 8 |
| 3. | మూడు విచిత్రాలు | ..... | 15 |
| 4. | పరుగు | ..... | 23 |
| 5. | తొలి హనీమూన్ | ..... | 31 |
| 6. | తప్పొప్పులు | ..... | 38 |
| 7. | వింత సత్యాగ్రహం | ..... | 45 |
| 8. | మల్లె మనసు | ..... | 53 |
| 9. | అర్ధరూపాయి: అర్ధాంగి | ..... | 61 |
| 10. | మనసు మైల పడలేదు | ..... | 68 |
| 11. | కొత్త లెక్కలు | ..... | 76 |
| 12. | మూడు ముడుల ముచ్చట్లు | ..... | 84 |
| 13. | మిత్రమండలి | ..... | 92 |
| 14. | సింగవ్వ సదువు | ..... | 99 |
| 15. | ఆదివారం పతివ్రతం | ..... | 107 |
| 16. | పులులూ అమాయకురాలూ | ..... | 115 |
| 17. | కొత్త విలువ | ..... | 122 |
| 18. | ఉగాది పచ్చడి | ..... | 129 |
| 19. | శేషయ్య శేషప్రశ్న | ..... | 136 |
| 20. | గుత్తా వొత్తడి | ..... | 143 |
| 21. | గోపీకృష్ణ – రాధాకృష్ణ | ..... | 150 |
| 22. | రెండు కళ్ళు – రెండు ముళ్ళు | ..... | 157 |
| 23. | సత్యసాయి సన్నిధి | ..... | 163 |
| 24. | సమన్వయవాది | ..... | 169 |